క్లుప్తంగా

నేడు పోలేరమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం



నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్ల శివారు గ్రామమైన జాష్టివారిపాలెంలో కొలువైయున్న పోలేరమ్మ తల్లి ఆలయ ఐదో వార్షికోత్సవం బుధవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు యలగాల వెంకటేశ్వర్లు చెప్పారు. 2019లో పురాతన ఆలయం స్థానంలో నూతనంగా ఆలయం నిర్మించినట్లు తెలిపారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకరణ అనంతరం కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

అల్లర్లకు పాల్పడితే రౌడీషీట్లు తెరుస్తాం

ప్రశాంత వాతావరణాన్ని భగ్నం చేయొద్దు



నాదెండ్ల: ఎన్నికల కౌంటింగ్ అనంతరం గ్రామాల్లో ఎవరూ ఘర్షణలు, అల్లర్లకు పాల్పడకుండా ప్రశాంత వాతావరణాన్ని భగ్నం చేయకుండా ఏర్పడేలా గ్రామస్తులు సహకరించాలని ఇన్‌చార్జి సీఐ సుబ్బారావు చెప్పారు. గణపవరం రామాలయం వద్ద ఎన్నికల కౌంటింగ్ ఆ తర్వాతి పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజకీయ ప్రేరేపిత కార్యక్రమాలకు ప్రజలు దూరంగా ఉండాలని, ఏ పార్టీ గెలుపొందినా సంయమనం పాటించాలన్నారు. రెచ్చగొట్టే విధానాలు, ఉపన్యాసాలు ఇస్తే కఠిన చర్యలు తప్పవని, అవసరమైతే రౌడీ షీట్లు తెరుస్తామని హెచ్చరించారు. ఘర్షణలు, అల్లర్లకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని కోరారు. కార్యక్రమంలో ఎస్సైలు జె. బలరామ్‌రెడ్డి, రాజీవ్ పాల్గొన్నారు.

సప్లిమెంటరీ పరీక్షలకు 22 మంది గైర్హాజరు

నాదెండ్ల: గణపవరం చుండి రంగనాయకులు డిగ్రీ కళాశాలలో మంగళవారం ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొదటి సంవత్సరం మాథ్స్–1బి, జువాలజీ, ఎకనామిక్స్ పరీక్షలు జరగ్గా, 581 మందికి గాను 22 మంది గైర్హాజరు కాగా 559 మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్షలకు చీఫ్ సూపరింటెండెంట్‌గా సత్తెనపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల లైబ్రేరియన్ శ్రీలక్ష్మీ, అసోసియేటెడ్ చీఫ్ సూపరింటెండెంట్‌గా కళాశాల వైస్ ప్రిన్సిపల్ సీహెచ్ చైతన్య వ్యవహరించారు.

గొడవలను ప్రోత్సహించే వారిపై చర్యలు తీసుకోవాలి

వినుకొండ(నూజెండ్ల): పోలీసుల ఆధ్వర్యంలో నూజెండ్ల గ్రామంలో సోమవారం నిర్వహించిన కార్డెన్ సెర్చ్‌లో పట్టుపబడ్డ కర్రలు, రాళ్లు వంటి వాటిని స్వాధీనం చేసుకున్నారు. అయితే చాలా మంది టీడీపీ వారి ఇళ్లల్లో కర్రలు, రాళ్లు పట్టుపడినా యజమానులను విచారించకుండా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం, ఏకపక్షంగా వ్యవహరించడంపై సర్వత్రా అనుమానాలు వస్తున్నాయి. గొడవలను ప్రోత్సహించే వారిపై కఠినచర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఎన్నికల ఉన్నతాధికారులను కోరుతున్నారు.

తీర్థయాత్ర నుంచి తిరిగి వస్తూ వృద్ధురాలు మృతి

నాదెండ్ల: తీర్థయాత్రకు వెళ్లిన వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మంగళవారం వెలుగులోకొచ్చింది. గణపవరం గ్రామానికి చెందిన అలపర్తి రమణమ్మ అలియాస్ జంపని రమణమ్మ (78) ఈ నెల 14న 30 మంది స్థానికులతో కలిసి ఉత్తర భారతదేశంలోని ఆధ్యాత్మిక కేంద్రాలకు 15 రోజుల తీర్థయాత్రకు వెళ్లింది. తీర్థయాత్ర పూర్తి చేసి తిరుగు ప్రయాణంలో సామర్లకోట వద్దకు వచ్చే సరికి అస్వస్థతకు గురై మృతి చెందింది. తోటివారు బంధువులకు సమాచారమిచ్చారు. సోమవారం రాత్రి గణపవరం గ్రామానికి మృతదేహాన్ని తీసుకొచ్చి మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. రమణమ్మ మృతితో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు 670 మంది గైర్హాజర్

సత్తెనపల్లి: పదో తరగతి సప్లమెంటరీ పరీక్షలకు సత్తెనపల్లి విద్యా డివిజన్ పరిధిలోని 14 మండలాల్లో మంగళవారం 670 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. టెన్త్ గణితం పరీక్షకు 1,769 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 1,099 మంది హాజరయ్యారు. 670 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

పోషకాహారం అందించకుంటే చర్యలు తప్పవు

- యడ్లపాడు ఎంఈవో–1,2 ఎస్ అరుణకుమారి, ఎం.నాగరత్నం
- మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీలతో సమీక్ష



సమావేశానికి హాజరైన మిడ్‌డే మీల్ ఏజెన్సీలు



మాట్లాడుతున్న ఎంఈవో నాగరత్నం

యడ్లపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వాహకులు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు అనుగుణంగా చిత్తశుద్ధితో నిర్వహించాలని మండల విద్యాశాఖ అధికారులు ఎస్.అరుణకుమారి, ఎం.నాగరత్నం పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం మిడ్‌డే మిల్ ఏజెన్సీలతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమీక్షలో వారు మాట్లాడుతూ పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు రుచికరమైన పౌష్టిక ఆహారాన్ని అందించాలన్న ప్రభుత్వ సంకల్పాన్ని ఉపాధ్యాయులు, ఏజెన్సీలు సమన్వయంతో విజయవంతంగా కొనసాగించాలన్నారు. విద్యార్థులకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించడంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థుల ఒక ముద్ద కూడా వృథా చేయకుండా ఉపాధ్యాయులు సైతం తినేలా నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. వీటితో పాటు వేరుశనగ చిక్కీలు, బెల్లం రాగి జావ, తయారు చేయడంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. వంటగది అందులోని వంటపాత్రలు ఎప్పుడూ శుభ్రంగా ఉంచాలని, వంట చేసే సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత తప్పక పాటించాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథక నిర్వాహకుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజన నిర్వాహకుల మాస్టర్ ట్రైనింగ్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వాహకులచే వంటల పోటీలు నిర్వహించారు. రుచి, శుచిగా తయారు చేసిన వారికి బహుమతులు అందించారు.

పగటి కలలు కనడం మానండి

టీడీపీ నేతలకు వైఎస్సార్ సీపీ నాయకుడు అట్లూరి విజయ్ హితవు

నరసరావుపేట: కూటమి అభ్యర్థులు గెలుస్తారని టీడీపీ నాయకులు పగటి కలలు కంటున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు అట్లూరి విజయ్ కుమార్ అన్నారు. మంగళవారం ప్రకాష్ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికలలో ప్రతి పేదవాడు సంక్షేమ పథకాలు అందుకున్న సంతోషంతో వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డికి ఓటు వేసి రెండవసారి సీఎం చేయబోతున్నారన్నారు. రాష్ట్రంలో ప్రతి పేదవానికి సంక్షేమ పథకాలు అందించి వారి కుటుంబాలను ఆదుకున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు.

ఎన్నికలలో కూటమి అభ్యర్థులు ఎన్ని ఇబ్బందులు పెట్టినా ప్రజలు ఓట్లు వేసి ఆయనకు మద్దతుగా ఉన్నారన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత నరసరావుపేటను శాంతిపేటగా మార్చారన్నారు. ఎన్నికల కమిషన్ జూన్ 4వ నిర్వహించే ఓట్ల లెక్కింపుకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు తలారి నాని, దుగ్గి వీరాస్వామి, బొమ్ము జయరావు, కాల్వ చిన్న బాబు పాల్గొన్నారు.

ఈపూరులో పోలీసులు కార్డన్ సెర్చ్



ఈపూరు: మండలంలోని అంగలూరు, కొండ్రముట్ల గ్రామాల్లో మంగళవారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇన్‌చార్జి డీఎస్పీ తిరుపతయ్య, రూరల్ సీఐ సుధాకర్ ఐదు మండలాల ఎస్‌ఐలు, పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బలగాలతో గ్రామాల్లోని పలుచోట్ల సోదాలు నిర్వహించారు. ఎలాంటి ఆధారాలు లేని వాహనాలను సీజ్ చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో గొడవలు జరుగుతున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా సమస్యాత్మక గ్రామాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ అనంతరం ఎక్కడైనా గొడవలు జరిగినా కఠినమైన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞానభాండాగారాలు



బొల్లాపల్లి: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా మంగళవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి ఆర్. సేవానాయక్ మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, విద్యార్థులు సద్వినియోగపరచుకొని జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. విజ్ఞానం తరగని సంపదని తెలిపారు.

వైరస్‌లను తట్టుకునే విత్తనాలతో సాగు చేసుకోవాలి

రెంటచింతల: పత్తి, మిరప పంటలను సాగు చేసే రైతులు పలు రకాల వైరస్ తెగుళ్లను తట్టుకునే విత్తనాలతో పంటలను సాగు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పత్తి, మిరప పంటల సాగులో తీసుకోవాల్సిన సమగ్ర సస్యరక్షణ విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పత్తి పంటకు ఇటీవల కాలంలో ఎక్కువగా గులాబీరంగు పురుగు నష్టం కలిగిస్తుందన్నారు. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు మాత్రమే గులాబీరంగు పురుగు నివారణకు పిచికారీ మందులను వాడుకోవాలన్నారు. ఇటీవల కాలంలో మిరప పంటకు సుమారు 82 రకాల వైరస్‌లు ఆశించి నష్ట పరుస్తాయని మూడేళ్లుగా పలు జిల్లాల్లో మిరప పంటకు తెగుళ్లు ఆశించడం వలన రైతులు తీవ్రంగా నష్టపోయారని గుర్తు చేశారు. మన రాష్ట్రంలో ఎక్కువగా ఆకు ముడత, కుకుంబర్ మొజాయిక్ వైరస్, మొవ్వ కుళ్లు వైరస్‌లు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. ముందుగా ప్రతి రైతు తాను సాగుచేసే పంట పొలంలో భూపరీక్షలు చేయించుకోవాలని, పంట మార్పిడి విధానాన్ని అనుసరించి, సేంద్రియ ఎరువులను వాడి సమతుల్య ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన కంపెనీల విత్తనాలను కొనుగోలు చేసి పంటలను సాగు చేసుకోవడం మంచిదన్నారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను వినియోగించితే తక్కువ పెట్టుబడితో మంచి దిగుబడులను సాధించవచ్చని పేర్కొన్నారు.

విద్యార్థులకు రుచికరంగా భోజనం అందించాలి

మధ్యాహ్న భోజన నిర్వహణపై అవగాహన



నిర్వాహకులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ

వినుకొండ(నూజెండ్ల): ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు మెనూ ప్రకారం పోషక విలువలతో కూడిన రుచికరమైన ఆహారం అందించాలని మండ విద్యాశాఖాధికారి నలబోలు రవిచంద్ర అన్నారు. జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భోజన నిర్వాహకుల వంటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మట్లాడుతూ రానున్న విద్యాసంవత్సరంలో నిర్వాహకులు అవలంభించాల్సిన విధానాలు తెలియజేశారు. 30 శాతం మంది విద్యార్థులు పౌష్టికాహారం లోపంతో ఉన్నారని వారికి నిబంధనల ప్రకారం మంచి ఆహారం అందించాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. భోజన నిర్వాహకులకు వీడియోల రూపంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలి



నాదెండ్ల ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడుతున్న తహసీల్దార్ అప్రిఫున్నిసా బేగం

నాదెండ్ల: గ్రామాల్లో ఎన్నికల కౌంటింగ్ అనంతరం అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు సమాచారం ఇవ్వాలని ఇన్‌చార్జి తహసీల్దార్ షేక్ అప్రిఫున్నిసా బేగం చెప్పారు. నాదెండ్ల మండల పరిషత్ కార్యాలయంలో వీఆర్వోలు, వీఆర్ఏలు, పోలీసు సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కౌంటింగ్ అనంతరం గొడవలు, అల్లర్లు జరిగే అవకాశమున్నందున, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ఉండాలన్నారు. అలాంటి సంఘటనలు జరిగే అవకాశం ఉన్నట్లయితే సమాచారం అందించటంతో పాటూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం గ్రామాల్లో పోలీసులు తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్, డీటీ అనురాధ, ఆర్ఐ రమీజా, రెవిన్యూ సిబ్బంది ఉన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



పశర్లపాడులో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య పర్యవేక్షకులు అంకమ్మరావు

రెంటచింతల: సీజన్‌లో వచ్చే వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మలేరియా ఆరోగ్య పర్యవేక్షకులు సీహెచ్ అంకమ్మరావు అన్నారు. మంగళవారం రెంటచింతల పీహెచ్‌సీ పరిధిలోని పశర్లపాడు గ్రామ కాలనీలలో ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించి మాట్లాడారు. ఇళ్లలో ఉన్న పాతటైర్లు, కొబ్బరి బొండాలను వెంటనే తొలగించాలని, కూలర్‌లలోని నీటిని వారానికి ఒకసారి కచ్చితంగా మార్చుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇళ్ల ముందున్న సైడ్‌కాలువలలో వారానికి ఒక్కసారి కిరోసిన్ లేదా బ్లీచింగ్ చల్లుకోవాలని, దీంతో ఈగలు, దోమలు నశిస్తాయని తెలిపారు. దోమ తెరలను వాడుకోవాలని సూచించారు. దోమలను పారదోలితే డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, మెదడువాపు, బోద వంటి వ్యాధుల నుంచి రక్షించుకోవచ్చన్నారు. వరుసగా రెండు, మూడు రోజుల పాటు జ్వరం వస్తే వెంటనే పీహెచ్‌సీలో రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ బాషా, హెల్త్ అసిస్టెంట్ మహేష్ బాబు, ఏఎన్ఎం శిరీషా, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

కొమ్ము ముక్కంటికి కన్నీటి వీడ్కోలు



ముక్కంటి భౌతిక కాయాన్ని ఊరేగింపుగా తీసుకువెళ్తున్న దృశ్యం

పిడుగురాళ్ల: మంచితనానికి మారు పేరు, చిన్న పెద్ద తేడా లేకుండా అందరినీ చిరునవ్వుతో పలకరించే వ్యక్తి.. ఓ పక్క పాస్టర్‌గా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ వైస్ చైర్మన్‌గా ప్రజలకు సేవలు అందిస్తూ ప్రజల్లో తనకంటూ ఒక మంచి స్థానాన్ని సంపాదించుకున్న కొమ్ము ముక్కంటి అకాల మరణంతో పిడుగురాళ్లలో విషాద ఛాయలు అలముకున్నాయి. అప్పటి వరకు కుటుంబ సభ్యులతో సరదాగా గడిపిన కొమ్ము ముక్కంటికి సోమవారం ఒక్కసారిగా గుండె నొప్పి రావడంతో గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించగా అక్కడ గుండెపోటు కారణంగా ముక్కంటి (61) మరణించారు. మంచితనానికి మారుపేరు పేరు అయిన మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి అకాల మరణంతో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు తీరని దుఃఖంలో మునిగిపోయారు. మంగళవారం ముక్కంటి భౌతిక కాయానికి అంత్యక్రియలు నిర్వహించారు. గురజాల నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో హాజరై ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించారు. ఆయనకు భార్య మరియమ్మతోపాటు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

ప్రత్యేక అలంకరణలో సంతాన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి



పిడుగురాళ్ల: పట్టణంలోని నాగుల గుడి దేవస్థానంలో మంగళవారం సంతాన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. నాగుల గుడి దేవస్థానంలో బహుళ షష్టి సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ పూజారి, ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలను అందజేశారు.

గొడవలు, అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు



కారుమంచిలో మాట్లాడుతున్న డీఎస్పీ తిరుపతిరావు



మాట్లాడుతున్న రూరల్ సీఐ సుధాకరరావు, ఎస్సై సురేష్

డీఎస్పీ తిరుపతిరావు

శావల్యాపురం: సార్వత్రిక ఎన్నికల అనంతరం గ్రామాల్లో గొడవులు అల్లర్లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నరసరావుపేట ఎన్నికల లెక్కింపు ప్రత్యేక డీఎస్పీ తిరుపతిరావు హెచ్చరించారు. మంగళవారం రాత్రి మండలంలోని కారుమంచి, మతుకుమల్లి గ్రామాల్లో కేంద్ర బలగాల సారథ్యంలో పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ తిరుపతిరావు మాట్లాడుతూ గ్రామాల్లో శాంతి భద్రతలు విఘాతం కలుగకుండా ఉండటానికి గ్రామాల్లో సోదాలతో పాటు కేంద్ర బలగాలచే ప్రత్యేకంగా కవాతు నిర్వహిస్తున్నామన్నారు. యువత ఇటువంటి రాజకీయ అల్లర్ల, గొడవలకు దూరంగా ఉండాలన్నారు.

ఓటు వినియోగించుకోవటం ప్రతి పౌరుడు ప్రాథమిక హక్కు అయితే రాజకీయ గొడవలు, అల్లర్లకు దూరంగా ఉండటం నైతిక హక్కుగా ప్రతి ఒక్కరూ భావించాలన్నారు. ఆయా గ్రామాల్లోని ప్రధాన కూడలి మార్గాల్లో ప్రజలతో ఎన్నికల నిబంధనలు, ఓట్లు లెక్కింపు అనంతరం పాటించాల్సిన జాగ్రత్తలు డీఎస్పీ వివరించారు. కవాతు కార్యక్రమంలో వినుకొండ రూరల్ సీఐ ఉప్పుటూరి సుధాకరరావు, ఎస్సై చల్లా సురేష్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సంయమనం పాటించాలి

శావల్యాపురం: ఓట్లు లెక్కింపు సమయంలో ప్రజలందరూ సంయమనం పాటించాలని వినుకొండ రూరల్ సీఐ ఉప్పుటూరి సుధాకరరావు అన్నారు. మంగళవారం స్థానిక మండల పోలీసు స్టేషన్ సందర్శించారు. ఈసందర్భంగా రూరల్ సీఐ మాట్లాడుతూ ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు నియోజకవర్గ రూరల్ పరిధిలోని మండలాల్లో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా సందర్భంగా అన్నీ గ్రామాల్లో 144 సెక్షన్ అమల్లో ఉందని శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా పోలీసు నిఘా పటిష్టం చేశామన్నారు. గొడవులు, అల్లర్లకు తావులేకుండా ఉండటానికి అన్నీ గ్రామాల్లో పోలీసులు సాయంత్రం, రాత్రి సమయాల్లో పర్యటిస్తునట్లు సీఐ వెల్లడించారు. సమస్యాత్మాక గ్రామాల్లో ఈనెల 3 నుంచి 5వరకు ప్రత్యేక పోలీసు బలగాల సారథ్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. శావల్యాపురం మండలంలో కారుమంచి, కొత్తలూరు, పోట్లూరు, వేల్పూరు, మతుకుమల్లి తదితర గ్రామాల్లో అదనపు పోలీసు బలగాలు కూడ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

అన్నీ పార్టీల నాయకులు కూడా ఎన్నికల కమిషనర్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని లేని పక్షంలో అటువంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. యువత రాజకీయ గొడవులు, అల్లర్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఎన్నికల సమయంలో కేసులు నమోదు అయితే పరిస్థితి చాలా కఠినంగా ఉంటుందన్నారు. ఎస్సై చల్లా సురేష్ రైటరు శ్రీనివాసరావు తదితర సిబ్బంది ఉన్నారు.

ఆర్టీసీ బస్టాండ్ వద్ద పోలీసుల మాక్‌డ్రిల్



బస్టాండు ఎదుట ఆందోళన చేస్తున్న ప్రజలు



కేంద్ర బలగాలతో కలిసి కవాతు నిర్వహిస్తున్న వన్‌టౌన్, టూటౌన్ పోలీసులు



మాక్‌డ్రిల్ కార్యక్రమంలో పాల్గొన్న పోలీసులు

వినుకొండ(నూజెండ్ల): సుమారు 100 మంది పోలీసులు... ఒక వైపు ఆందోళన కారులు పోలీస్ గోబ్యాక్ అంటూ స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ వద్ద ఆందోళన కారులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీచార్జీ చేశారు. ఇదంతా వందలాది మంది చుట్టుపక్కల ప్రజలు చూస్తుండగానే ఆందోళనకారులను పోలీసులు ఎట్టకేలకు చెదరగొట్టారు. ఎన్నికల అనంతరం జరిగిన గొడవల నేపథ్యంలో పోలీసులు మాక్‌డ్రిల్ నిర్వహించారు. పోలీసులపై రాళ్లువేస్తున్న ఆందోళనకారులు, వారిపై టియర్‌గ్యాస్ ప్రయోగించడం, ఫైరింగ్ చేస్తూ పరిస్థితిని అదుపులోకి తీసుకురావటం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో మాక్ డ్రిల్ అనంతరం జిల్లా అడిషనల్ ఎస్పీ రాజు మాట్లాడుతూ ఎవరైనా అల్లర్లకు పాల్పడితే ఇలాగే కఠినచర్యలు తీసుకుంటామని, కౌంటింగ్ తరువాత కూడా అల్లర్లకు పాల్పడిన వారిపై ఇలాంటి చర్యలు చేపట్టడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో వినుకొండ టౌన్ సీఐ సాంబశివరావు, రూరల్ సీఐ సుధాకర్, పోలీసులు పాల్గొన్నారు.

హింసాత్మక ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు

నరసరావుపేట టౌన్: పట్టణంలో వన్‌టౌన్, టూటౌన్ పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం కవాతు నిర్వహించారు. పల్నాడు బస్టాండ్ నుంచి మొదలైన కవాతు ర్యాలీ ప్రధాన రహదారి గుండా మల్లమ్మ సెంటర్ వరకు చేరింది. ఈ సందర్భంగా వన్‌టౌన్, టూటౌన్ సీఐలు కృష్ణారెడ్డి, భాస్కర్‌లు మాట్లాడుతూ రానున్న ఎన్నికల కౌంటింగ్ దృష్టిలో ఉంచుకొని ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామన్నారు. వచ్చేనెల 4 కౌంటింగ్ తేదీ పట్టణంలో 144 సెక్షన్ పకడ్బందీగా అమలు చేసేందుకు ఇప్పటికే ప్రణాళిక రూపొందించామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు సతీష్, అశోక్, సీఆర్పీఎఫ్ సిబ్బంది, ప్రత్యేక కేంద్ర బలగాలు పాల్గొన్నారు.

విత్తనాలు అధిక ధరలకు అమ్మితే చర్యలు



పిడుగురాళ్ల విత్తన దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏవో ఎస్.శ్రీనివాస్‌రెడ్డి

పిడుగురాళ్ల: విత్తన దుకాణ యజమానులు రైతులకు ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే దుకాణ యజమానులపై చర్యలు తప్పవని పిడుగురాళ్ల ఏవో ఎస్.శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని విత్తన దుకాణాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఎవరైనా సరే ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువకు విత్తనాలను అమ్మితే అటువంటివారిపై చర్యలు చేపడతామన్నారు. అలాగే అనుమతి లేని, నాసిరకం విత్తనాలను అమ్మిన యెడల చట్టపరంగా చర్యలు తీసుకుని లైసెన్స్ రద్దు చేయటమే కాకుండా వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయటం జరుగుతుందని తెలిపారు. విత్తన దుకాణాల్లో విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని సూచించారు. అనంతరం విత్తన దుకాణాలను తనిఖీ చేసి, స్టాక్ రికార్డులు, బిల్లు పుస్తకాలను పరిశీలించారు. విత్తన నమూనాలను సేకరించి సీడ్ టెస్టింగ్ ల్యాబ్‌కు పంపించటం జరిగిందని ఈ సందర్భంగా ఏవో తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

యడ్లపాడు: అప్పుగా ఇచ్చిన నగదు చెల్లించటం లేదని వెల్లడించినందుకు రుణగ్రస్తుడు రుణదాతల కుటుంబాలు వారు దాడి చేసుకున్న సంఘటన మండల కేంద్రమైన యడ్లపాడులో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం...స్థానిక కొత్తూరుకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ తిమ్మిశెట్టి రోశయ్య అదే గ్రామానికి చెందిన సాగి సాంబయ్యకు గతంలో రూ.60 వేలు అప్పుగా ఇచ్చాడు. ఈ నేపథ్యంలో రోశయ్య ఈనెల 26న తన స్నేహితుడైన ఐ నాగరాజుతో స్థానిక టెంట్‌హౌస్ దగ్గర మాట్లాడుతూ తన కుమారుడు వివాహం కుదిరిన నేపథ్యంలో అప్పుగా తీసుకొని నగదు ఇవ్వమని సాంబయ్యను పలుమార్లు అడిగినా ఇవ్వటం లేదని తెలిపాడు. ఇంతలో అక్కడికి వచ్చిన సాగి సాంబయ్య అతని కుటుంబ సభ్యులు రోశయ్యతో వాగ్వాదానికి దిగారు. కర్రలు, ఇనుపరాడ్లతో ఇరువర్గాల కుటుంబసభ్యులు పరస్పరం దాడి చేసుకున్నారు గాయపడిన రోశయ్యను చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఇరువర్గాలపై కేసుల నమోదు చేసినట్టు ఎస్ఐ జె శామ్యూల్ రాజీవ్‌కుమార్ మంగళవారం తెలిపారు.